కొముందికి

‘‘చూడండి! - ఇల్లా చూడండి - ఈ దిప్పకాయ ఏం చేస్తున్నాడో!” అంటూ మా అమ్మమ్మ, పసివాడిని చంకనేసుకువచ్చి, ముసిముసి నవ్వులతో తాతగారి ముందు పారాడవేసింది.

“ఏం ఏం చేస్తున్నాడేం?-” బవిరిగడ్డంలో తాతగారి పెదవులు కదిలినవి. అమ్మమ్మ అందుకు సమాధానం చెప్పకుండా, ఏభై యేళ్ళనాటి కులుకుతో— వయ్యారంగా ఆయనవంక చూసింది—

“ఎక్కడికి పోతాయ్! - అవే గుణాలు....మీ ముని మనుమడు కాదూ?” అంటూ నవ్వుకుంటూ నిష్క్రమించింది.

నేను పాపణ్ణి అందుకుని బుగ్గలు పుణుకుతూ “ఏం చేశావు నాన్నా!” అన్నాను.

తాతగారు అందుకున్నారు - “ఏదో చేసి ఉంటాడని - మీ అమ్మమ్మ మాట ప్రమాణం. ఏమిటో వివరించకుండా, ముసిముసి నవ్వుల వయ్యారిగా, అంత పండు ముత్తయిదువా, అట్టే మారిందంటే - అదేదో తప్పకుండా మగసిరి అయి వుండాలిరా నాయనా! - అయినా....మరోసారి బరిమీదికి వదిలిచూడు - చూద్దాం!”

పాపణ్ణి విడిచాను. వాడు గుమ్మడిపండల్లే గుమ్మం దొర్లుకుపోయి - లోపలి సావడిలో....మా చెల్లెలు కూతురు - పడసారం పడి యీడుది-నిదురపోతూంటే.... పక్కనుజేరి - దాన్ని లేపి - యిద్దరూ కలిసి కేరింతలౌతున్నారు....

ఇంకా, ఏడాదన్నా వెళ్ళలేదు, అప్పుడే వీడికి ఈ బుద్ధులా? - నేనో అడుగు ముందుకువేసి, గదమాయించాను. వాడు నా వంక చూసి, కళ్ళు చికిలించి....మళ్ళీ తన ధ్యాసలో తాను ఉన్నాడు.

ఒక్క గుంజు గుంజుదామన్నంత రోషం వచ్చింది - తాతయ్య నన్ను ఆపారు....

"వాడు నీ మాట వినలేదనా, నీకు అంత అహంకారం?"

"నీ మాటమీద - నీకు గురి ఉండచ్చు—కాని అవతలివాడు నీ కొడుకైతే మాత్రం - అంత లక్ష్యమూ ఉండి తీరాలని ఏమిటా హజం !...."

"పసివాడా? - బ్రహ్మవేత్తలందరూ పసివాళ్ళే. తండ్రిని ఎదిరించి ధర్మరక్ష చేసినవాళ్ళే - వాళ్ళకు తెలియని మర్మాలు ఏముంటాయోయ్ !—"

వెనుకటి కథ - యిద్దరం కలసి చూద్దామా?....

మంచు చినుకులు క్రిక్కిరిసిన ఒరపిడితో నున్నవి - గరుకుగా వుంది, అనంత—అయోమయం.

అపూర్వ వర్ణాలు, శబలించే పరివేషం, ఆత్మప్రదక్షణంగా స్పందించుతూంది.

రంగు రంగులన్నీ చిరునవ్వడులై....కింకిణీ కిణకిణలై, పాయలు పాయలుగా నాట్యం చేస్తున్నవి. ఉషాదేవి, బాల భానుడికి వయ్యారంగా స్వాగతం యిస్తూన్నది....

వేయి వెలుగుల వాడితో, సప్తాశ్వాలూ ఒకటే అలగా పరవశించినవి. వెలుగు ఫెటేలుమని వెల్లి విరిసింది -

కణకణ వడపోతకు — మేఘాలన్నీ - హెచ్చు తగ్గులుగా ముందుకు కమ్ముకున్నవి.

ఆశ్రమం మీదికి - వెల్లని చల్లదనం ఏకధారగా కురుస్తూన్నది.

అది - ఆశ్రమం. మహర్షి ఉద్దాలకుడి ఆశ్రమం.

ఉద్గీథంగా, హోమ ధూమం - అలసవర్తులంగా - పవమానుడి బాసటతో ప్రసరించుతూన్నది.

అది ఆశ్రమం. అంతటా, వేడీలేదు - క్రీనీడా లేదు—

కలల బరువంతా ఝళిపించి, లేడి పిల్ల లేచి నిలుచున్నది....అడుగు ముందుకు వేస్తూన్నది....గోముగా పువ్వెత్తున పెరిగిన పసిరిక - ఈ వాలుకు వంగి లేత లేత గరికపోచలను, ఆకలికి అందిస్తూన్నది. కాని, లేడిపిల్ల అటూ ఇటూ నోరు మెదప కుండా —

మందారాల చాయను, మ్రాగన్నుగా వున్న ఆడుపులి మీదికి చెంగున దుమికింది. గిట్టలతో తర్జన భర్జన చేసింది. ముట్టెతో చక్కిలిగిలి పెట్టింది. ఆడుపులి నిదానంగా, తల్లి అల్లే, పడక సరిచేసుకుని లేడిపిల్లకు కడుపు నిండించింది....

తల్లి, ప్రాతస్సంధ్యను వుపాసించేందుకు విహాయసంలో ఎటో తేలుతూంటే - పిల్ల పిచ్చుక, నడలు అలవడుతూన్న వుబలాటంతో - కులాయం అంచునుంచి తొంగి చూడపోయి - కిచకిచగా, క్రిందకు రాలిపోయింది. నేలను కాలూనే దిటవులేదు, రెక్కలకు సత్తువలేదు. అటూ ఇటూ మెసలి, మసలి — అక్కడే ముద్దకట్టుకు పడి వున్నది....

అదిగో - ఆ మల్లెపొద చాలులో సూర్యనమస్కారాలు చేస్తూన్న, గోధుమ వన్నెనాగు - కర్మసాక్షికి కడసారి ప్రణామం చేసి - ఒక్కఊసలో ఇక్కడికి సాగింది. పుణుకుతూన్నట్లు ఊపిరి బిగబట్టి ఊదుతూ, పిచ్చికపిల్లను సేదతీర్చడానికి యత్నిస్తూన్నది.

కాని - ఎంతకూ అది కోలుకోవడంలేదు.....ఇది అలసిపోతూన్నట్టు వుంది. ఊపిరి పీల్చినప్పుడల్లా, తోక దగ్గిరనుంచీ ఆక్కశించుకు పోతూంది. నాగు ఎంతో అలసింది, ఎంతో అలసింది.

— ఎక్కడనుంచో వాలింది, గరుడపక్షి. కిరణమల్లే దూసుకుంటూ వచ్చి.... అల్లంత ఎత్తున నిల్చిపోయింది. రెక్కలు అల్లార్చుతూ నాగుకు ఓపిక పోస్తున్నది.

— పువ్వులు రువ్వినట్టుగా, మూగినవి గువ్వలూ పావురాలూ — ఆపైన చాందినీగా, కువకువగా చూసి - అక్కడ నిలువకుండా పోయినవి.

అల్లంత మలుపులో - గున్న మామిడితో మారాంచేస్తూ నిలుచున్నాడు పసిపాపడు. కొమ్మలన్నీ ముందుకు వంగి - అందుకోమని కవ్విస్తూన్నవి. దోరతనం

మురిపిస్తూన్నవి. పాపడైతే - ఏ పండూ అంటిముట్టలేదు. అన్నింటికీ ఒక్కటే సమాధానంగా తల ఊగించాడు. కొమ్మలన్నీ వెక్కి - వెక్కి వెనుకకు తగ్గి పోయినవి.

మారాకైనా లేని, చిటారు కొమ్మ అందుబాటుగా ముందుకు వాలింది. అడుగక ముందే అరమ్రగ్గని పండు, దోసిటిలో రాల్చి....వెంటనే అన్నింటికన్నా మిన్నగా తల ఎత్తుకుంది.

ఇంకా....దోసిటిలో పండు దోసిటిలోనే వుంది; గువ్వలూ, పావురాలూ కువ కువగా పాపడిమీద వ్రాలినవి. ఒక పావురం చెవిదగ్గరచేరి....ఒక్క గుక్కలో.... అంతా చెప్పింది....పాపడు అడుగు ముందుకు వేసినాడు. గువ్వలు ఇటు .... ఇటు అంటూ దారితీసినవి....

పిచ్చిక పిల్లకు రెక్క రవంత ఆడించే సత్తువ వచ్చింది. నాగు, గ్రుక్క తిప్పు కున్నది....గరుడపక్షి....వీళ్ళను చూసి....ఎత్తుకు తప్పుకున్నది.

పాపడిచేతిలో పండు....పావురాలు రెక్కలమీద అందుకున్నవి. పిచ్చికపిల్ల, పాపడి అరచేతిలో ఒదుగుతూ - చేసిన తప్పుకు సిగ్గుపడ్డది. బ్రతిమాలుతూ.... చంచువు, వజ్రశిఖరంమీద పదను తీర్చుకున్నది....పాపడు చేయి డోలికగా కదల్చి బుజ్జగించాడు. గువ్వలు ననలన్నీ ఏర్చి గూటిలో మెత్తదనం సరిచేసినవి. పిచ్చిక పిల్ల లేతపానుపుమీద....అలవోకగా ఒరిగింది....

పాపడు చేరువకాగానే, అన్నీ కలసి నవ్వినవి. తల వంచుకుని ఆశ్రమంలోకి వెళుతున్నాడు....

"అన్నా!" అని చీరింది, చిలుక....తల ఎత్తి ఆ వంక చూశాడు. చేతులో పండువంక తల విసిరింది. మరపు మరచిపోయి....చేయిజాచాడు. చేవచూసి, పుటుక్కు మనిపించి, ఆ ముక్క పాపడికి అందించింది. ఏమేమో....తోటి చిలుకకు చెప్పినట్టు చెప్పింది. రెండు గొంతులూ నవ్వుకున్నాయి.

ఆ పండు తనక అమ్మకు అందివ్వాలి....అమ్మ ఎక్కడుంది?....

అతిథి పూజకు సంభారాలు అమర్చడంలో సతమతమౌతూంది. ఈ వంక చూసేందుకన్నా తీరికలేదు....ఊహుఁ....అతిథిపూజ కానిదే ప్రాశన చేయరాదు....

ఎవరా అతిథి?

ఎవరో మహర్షి !

అమ్మకు అక్కరలేని పండు, చిలుక ఏం చేసుకుంటుంది....పైకి విసిరి వేశాడు....చిటారుకొమ్మ అందుకోకుండా ఒత్తిగిలింది....పండు. వెలుగు రాముకుంటూ దొర్లిపోయి .... చంద్రమండలమైంది .... చుక్కలు సమశ్రుతిలో ముఖరితంగా మెరుస్తూన్నవి....

అతిథి వేంచేశాడు.

ఆశ్రమవాటిని అంటి పరవళ్ళయ్యే సెలయేరు పాయ మలచి....అతిథికి అడుగులకు మడుగులొత్తింది - తీవెకో పూవు, పూవుకో రేక....సేసలుగా, కురిసినవి. వనస్పతులు అతిథిని కళ్ళకు అద్దుకున్నవి.

మహర్షులిద్దరూ అభిముఖులై .... మనో అనుసంధానంగా కుశలమడుగు కొన్నారు.

పాపడు తన పసితనం మరచిపోయి....సంప్రదాయం అవగతం చేసుకుంటు న్నాడు—అతిథి సత్కారక్రమం ముగియగానే....అమ్మ చంక నెక్కవచ్చు నను కున్నాడు....

తల్లి యిటే వస్తూంది. తనవై పే!—తనను లాలించేందుకే! .... పసికందు బారసాచుకుని, వుబలాటంతో ముద్దులుకురుస్తూ గునగునమంటున్నాడు. కాని....

ఇంటికి వచ్చిన అతిథి - అమాంతం తల్లికీ, బిడ్డకూ అడ్డంవచ్చి .... ఒడిసి ఆ యిల్లాలి చెయిపట్టుకున్నాడు. ఒంటరితనం వైపుకు లాక్కుంటున్నాడు.

పాపడూ గువ్వలూ....ఆశ్రమం పచ్చదనంలోకి హాయిగా చెల్లాచెదరైనారు.

పిచ్చిక, పిల్లపాటు తల్లికి, గాలి అల ఒకటి, కబురు చెప్పింది. తల్లి కిక్కురు మనలేదు.

"ఆశ్రమవాటిలో పతనమేటి, వెర్రిదానా!" అని గాలి అమాయకత్వానికి తనలో నవ్వుకున్నది.

మరో అల, ఇంతలో పిల్ల కిలకను, తల్లికి నివేదించింది.

తల్లి, ఆ అలమీదనే ఆశ్రమ ముఖమైంది. పచ్చని నీడల పరవడిలోవున్న పాపడి చెంగటికి లోగి....తెక్కల అంచులతో, దీవెనగా చెక్కిలి పుణికి....ఒంటి రెక్కమీద పైకి ఎగిరింది—

పాపడి మనసు చేసిన ఘనకార్యానికి పొంగిపోయింది. తండ్రికి తెలిస్తే - ఎంత చక్కన!—

మర్రి ఊడల ఊయెలలో మహర్షి ఉద్దాలకుడు....ఒరగిలి వున్నాడు. గువ్వలూ పావురాలూ గుమిగా - ఏవో మంతనా లాడుతున్నవి. ఆయన తల ఊచుతూ మౌనంగా నవ్వుతూంటే....అంత మెరా; వెలుగులో - వెలుగు రిల్ మంటూంది—

మహర్షి పత్ని నిదానంగా తలయెత్తి అతిథివంక చూసి....ఆ కళ్ళలో, నకనక కనిపెట్టింది. భర్తవైపు ఓరగా చూసింది. ఆయన మెరమెచ్చుగా తలపంకించాడు. ఆ యిల్లాలు విధేయురాలై - తరలిపోతూంది....

పసికళ్ళ ఈ వైనమంతా కనిపెడుతూన్నాయి. కాళ్ళ నిలువనిచ్చినవి కావు.

రోదసీ దద్దరిల్లేట్టు హుంకరించాడు. అతిథి యీ అగ్నిగోళాన్ని చూసి.... వివశుడైనాడు—ఒకలిప్త - గాలికూడా ఊపిరి బిగపట్టింది....

మహర్షి కనురుతూ అన్నాడు....

“అది....అంతే!....”

పాపడి కాలు....మరింత ఊది నిలచింది....

“అంతే నాయనా! - ఆడది, ఆశ్రమం ఫలించే....పండూఫలం ఎంతో అంతే!- ఎవరైనా ఆకలి తీర్చుకోవచ్చును....”

బుజ్జగింపుగా, దారికి అడ్డు తప్పించి తన దగ్గిరకు తీసుకుందామని పెనుగులాడాడు.

పాపడి గొంతు మహర్షి ప్రమాణానికి ఎగసింది.

“ఈ ఆడుది....నా తల్లి!....

నా తల్లితో చనువుగా మెలిగే....అధికారం, అదృష్టం-నా తండ్రిదేనని - మహర్షికి నేను మనవి చేయాలా?”

మనవి, మహర్షి వినిపించుకోలేదు....

“నీ తల్లి! - నీ తల్లీ లోకంతోపాటే - అందరు పుణ్యాంగనలూ అతిథిని కళ్ళకు అద్దుకోవడం లేదా? - ఈ మొగానే ప్రొద్దుపొడిచిందా?....”

శాంతం గర్జించింది. కాని, పసిపాపడు గాద్గదికం లేకుండా ప్రతి — పలుకు తున్నాడు ....

"ఈ మొగానే కాదు....ఇకనుంచి....లోకంలో తల్లులందరూ - ఇల్లాళ్ళందరూ నా తల్లి తోబాటె - ఇది, నా అనుశాసనం. ఇది శ్వేతకేతుడి అనుశాసనం. ఈ క్షణం నుంచి లోకంలో ప్రవర్తిల్లుతుంది!...."

మహర్షి హుంకరింపు - అగ్నిశిఖగా జాజ్వల్యమైంది. పసిపాపడి బ్రహ్మ వర్చస్సు అంతకుమించిన వుద్వేత్తున, దీటుగా వెలిగింది....

"ఆ వ్యవస్థ - ఆ సంప్రదాయం....ఇంతటితో అంతరించింది...."

మహర్షి ఉపశమించాడు....

"నాయనా, వ్యవస్థను ధిక్కరించే యీ అజ్ఞానం భవిష్యత్తుకు అనర్థం-" అని అనునయంగా వివరించబోయినాడు.

"అనర్థమో - వరమో నిర్ణయించేది మనంకాదు...."

మహర్షి, పసిపాపడివంక నిశ్చలంగా చూశాడు. పాపడి చూపులకు ఎదురు—చూడలేక....ఆశ్రమ ప్రాంగణంలోకి వచ్చి తల ఎత్తాడు — ధర్మలోపం - ప్రళయం కాదా?....చుక్కలు రాలవేం....భూమి కంపించదేం?—ఏ గతీ తప్పలేదేం?.... బ్రహ్మవేత్త మనస్సు - అనంత - అజ్ఞానంలో జ్ఞాన లవలేశాన్ని అన్వేషించుతూంది...

(కథలోంచి తెప్పరిల్లాను.)

"అంతే నంటావా, తాతయ్యా!...."

తాతగారు ఆలోచనగా తల ఊగించారు....

"ఆహా!—ఆనాడు అంతే! - ఆడదంటే - కొట్టాంలో కట్టివేసిన గొడ్డుతో సమానం. ఇంట్లో వాడుకునే చెంబూ, తప్పేలాతో సమానం! ఆసామికి ఉన్న చరాస్తిలో అదో పనిముట్టు. అరుగుమీద పరచిఉండే నలిగిన చాప! - అతిథి ఎవరు వచ్చినా హాయిగా పడుకోవచ్చు. — పడి దొర్లవచ్చు. — అభ్యంతరం ఏమీలేదు - లేకపోగా....అతిథి సత్కార సంభారాల్లో....అవసర నైవేద్యాల్లో - ముఖ్యంగా అదొకటి!...."

"అవన్నీ వట్టి గొడ్డురోజులంటావా?"

"ఆ మొగుళ్ళందరూ పశువులంటావా?"

అది యిప్పటి దామాయిషి ప్రకారం నాగరికత అని అనడానికే వీలు లేదంటావా ?

—అన్నా ఫరవాలేదు. కాని ఒక్కటిమాత్రం మరచిపోకూడదు—వాళ్ళందరూ చచ్చూ పుచ్చూ చవటలా? బ్రహ్మవేత్తలు కారటయ్యా. — సరే....వాళ్ళజోలి మన కెందుకుగాని....

వాడి పుణ్యమా అంటూ ఆనాడు....ఆ పసిపాపడు ఎదురుతిరిగి అలా నోరు చేసుకుని ఉండకపోతే—యివాళటి వరకూ ఆడది చేట పెయ్యలాగా....ఓ మూలను పడిఉండేదే కద - యీ వరుసను, యిప్పటి మహోద్యమాలన్నీ అంకురించడానికి ఎన్నియుగాలు పట్టేవో యింకా—"

తాతయ్య చెప్పిన ముక్కలు తెలిసినవికాని....ఆ ధోరణిలో స్వారస్యం అర్థం కాలేదు—

"ఇంతకూ....నీ వనేది...."

"నే వనేది....ఏమిటో సరిగా అర్థం కాలేదు కామా! - ఏంలేదు - పసిపాపల సరసం చూడగా — ఆ కాలం మనసులో మెలిసింది....పసితనం కనుకనే — యీనాడైనా ఆడది అంత అందుబాటులో ఉంది - కాదని గద్దించేందుకు - మనం ఎవరం-పెరిగి పెద్దవాడైన తరువాత....అంక్షలు కళ్ళకూ, కాళ్ళకూ ఎలాగూ ఉండనే ఉన్నాయిగా - ఇప్పటికి యీ పైదికమూర్తులు ధన్యులు...."

"చిన్నతనంనుంచీ - వాళ్ళను దిద్దకపోతే—"

"పెద్దయిన తరువాత వంగరు — నిజమే ! - అందువల్ల, వాళ్ళకు వచ్చిన లోటు ఏమిటో - పితృవాక్య పరిపాలనమీద నీకు చాలా మమకారంలాగా ఉందే, చూడగా ! - నీ కడుపున పుట్టినవాడు నీ మాట వినకుండా....తన మనసుకు తోచింది చేసే పూనిక కనబరచాడంటే - నీవు కృతార్థుడవు.

చూసి సంతోషించు ? -

ఇది, నాలాటివాళ్ళు తరించవలసిన ఘట్టం...." అంటూ తాతగారు, తన యిల్లాలిని కేకవేసేందుకు లోపలికి వెళ్ళారు. పాపలిద్దరూ నవ్వుతూ నన్ను కవ్వించారు. అక్కడే నిలుచుంటే వాళ్ళ కడుపున పడతానేమోనని భయంవేసి పారి పోయినాను.